# నిజం

ట్రైన్ కూత వినగానే తాత  లేచాడు. లోతుకుపోయిన అతని కళ్ళలో ఓ చైతన్యం విరిసింది. వచ్చేది ప్యాసంజర్ ట్రైన్. కనీసం ఓ అరడజను సోడాలైనా అమ్మవచ్చు!

అతని కడుపులో కాలుతున్న ఆకలే వైశాఖ మాసపు  టెండగా మండిపోతున్నట్టు తోచింది, తాతకి బలం సంతరించుకొని లేచి నిలబడ్డాడు. సోడాలు  అందుకున్నాడు.

అడుగుమీద అడుగువేసి నడిచేటప్పుడు ఆ ముసలివాని చేతులు బరువు మొయ్యలేక వణికాయి. ఓ నిముషం స్టేషన్  దగ్గర అశోక చెట్టు క్రింద నిల్చున్నాడు.

బ్రతుకనే విశాలమైన  స్టేషన్‌లో ఇప్పుడు నీడనిచ్చే రావి చెట్లు లేవు. తమకే కావాల్సినంత నీడని సంతరించుకోలేని అతని కొడుకులాంటి అశోక చెట్లు  అక్కడక్కడ ఉన్నాయి.

ట్రైన్ వచ్చేసింది. కొబ్బరి బొండాలమ్మేవారు మంచి వ్యాపారం  చేస్తున్నారు.

"సోడా, సోడా" అని అరుస్తూ ప్రతీ కంపార్టుమెంటు దగ్గరకూ వెళ్ళాడు తాత.

ఏ ఒక్కరూ   సోడా అడగలేదు. కొబ్బరి బోండాల గురించి, గోల్డుస్పాట్ గురించి  పరుగెత్తేవారే, అందరూ.

ప్యాసింజర్ ట్రైన్ ఎక్కేవాళ్ళ చేతిలో కూడా అంత డబ్బు చూసి ఆశ్చర్యపోయాడు తాత. నిరాశతో వెనక్కు నడిచేడు.

"సోడా, ఓ సోడా"

కేక విని అదిరిపోయాడు, సంతోషం పట్టలేక ట్రేపుచ్చుకొని పరుగెత్తాడు.

"సోడా ఎంత?" అడిగింది ఓ అమ్మాయి. దాహానికి కాబోలు ఆ అమ్మాయి వళ్ళో ఉన్న చంటి బిడ్డ గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

“అర్ధ రూపాయి” సోడా పైకి తీస్తూ అన్నాడు తాత.

మొలలోంచి సంచీ తీసింది ఆ అమ్మాయి చిల్లర పైసలు లెక్కవేసింది. ఆమె మొహం చిన్నబోయింది.

“అర్ధ రూపాయే ముప్పయి పైసలు కాదా?”

తాత ఏమీ అనలేదు, తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ వెనక్కునడిచాడు.

దేశంలో కొబ్బరి బొండాలు, గోల్డుస్పాటులు తాగేవాళ్ళ సంఖ్యతో పాటు, సోడానీళ్ళు కూడా తాగలేని వారి సంఖ్య కూడా పెరిగిందన్న నిజం తాతకి ఆ రోజు తెలిసింది.

ఆంధ్రభూమి దిన పత్రిక 1991 అక్టోబర్

కథా నిలయం
శ్రీకాకుళం